క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండ గోపాల్‌పూర్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 29న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. పోచమ్మగుడి, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేత్రదానం

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మరణించిన హసన్‌పర్తి మండలం భీమారానికి చెందిన గోపరబోయిన విజయలక్ష్మి మృతదేహం నుంచి నేత్రాలు సేకరించారు. తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయలక్ష్మి భర్త గోపరబోయిన కొమురయ్య అనుమతితో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల, ఎల్వీ.ప్రసాద్ నేత్ర వైద్య సిబ్బంది మృతురాలి నేత్రాలను సోమవారం సేకరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ సాంబయ్య, అలయన్స్ క్లబ్ ప్రతినిధులు సుజాత, రవీందర్, స్థానికులు గడ్డం శివరాం, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కాజీపేట: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కార్యకర్తలు మరింతగా ప్రచారాన్ని నిర్వహించాలని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. కాజీపేట పట్టణంలోని పలు కాలనీల్లో కాంగ్రెస్ నాయకుల ఇళ్ల వద్దకు సోమవారం వెళ్లి పార్టీ కోసం పని చేయాలని కోరారు. ఎండీ.అంకూస్, ఎంవీ.రాజు, బుర్ర బాబుగౌడ్, మహమూద్, భరత్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం



హన్మకొండ కల్చరల్: అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమీ, అన్నమయ్య సాహితీ కళా వికాస పరిషత్ ఆధ్వర్యంలో లక్ష్మీదేవి పద్మావతి సమేత శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవాన్ని హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు సూత్రపు అభిషేక్ మాట్లాడుతూ అకాడమీ నుంచి వరంగల్‌లో అన్నమాచార్యుల విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు.

గజ్జెల సుమన్‌కు జాతీయ అవార్డు



వరంగల్: ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో అఖిల భారత ఎన్జీఓ సంస్థ కేబీఆర్ ఫౌండేషన్ బాలరాజు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సామాజిక సేవకుడు, బ్లడ్ డోనర్, మోటివేటర్‌గా సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్‌ను జాతీయ సేవారత్న అవార్డుతో సత్కరించారు. హనుమకొండ జిల్లాలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూనే ఇప్పటివరకు 16సార్లు రక్తదానం చేయడంతో పాటు కొన్నేళ్లుగా రక్తదానంపై అవగాహన కల్పించి, వారితో రక్తదానం చేయించారు.

బ్యాడ్మింటన్‌లో విద్యార్థికి బంగారు పతకం



వరంగల్ చౌరస్తా: ఈనెల 27న హర్యానా రాష్ట్రంలో 13వ జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్‌లో అండర్-15లో వరంగల్ జిల్లా ఏనుమాముల ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఈర్ల సురేందర్ కుమారుడు ఈర్ల సిద్ధార్థ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. ఏనుమాముల రెడ్డిపాలెంలోని ఇన్‌ఫ్యాంట్ జీజెస్ కాన్వెంట్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న సిద్ధార్థ.. గతంలో మంచిర్యాల నిర్వహించిన పోటీలో పాల్గొన్నాడు. అలాగే, వరంగల్ ఓసిటీ ఇండోర్ స్టేడియంలో జులైలో నిర్వహించిన పోటీల్లో 12వ స్టేట్ మీట్‌లో రజత పతకం సాధించాడు.

రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఘర్షణ

కాజీపేట అర్బన్: వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట సోమవారం కొంతమంది వ్యక్తులు ఘర్షణకు పాల్పడ్డారు. డాక్యుమెంట్ రైటర్‌గా కొనసాగుతున్న ఓ వ్యక్తి వద్ద పని చేస్తున్న వ్యక్తిపై ఐదుగురు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు సమాచారం. కాగా, సదరు వ్యక్తిపై దాడి వ్యక్తిగతమా లేకా దస్తావేజుల తయారీలో చోటు చేసుకున్న గొడవ అనేది తేలాల్సి ఉంది. ఇరువర్గాలు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసేందుకు వెళ్లినట్లు తెలిసింది.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

హన్మకొండ అర్బన్ / వరంగల్: వివిధ వర్గాల ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, అమలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పట్నాయక్ మాట్లాడుతూ హరితహారం, గొర్రెల పంపిణీ, బీసీ, మైనార్టీలకు రూ.లక్ష ఆర్థికసాయం, గృహలక్ష్మి, దళిత బంధు, భూ పట్టాల పంపిణీ, సామాజిక భద్రతా పింఛన్లు, కారుణ్య నియామకాలు, నోటరీ భూముల క్రమబద్ధీకరణ తదితర అంశాల అమలు పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. హరితహారం, దశాబ్ది సంపద వనాల కింద నిర్ధారించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఎఫ్ఓ లావణ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌కుమార్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వరంగల్ నుంచి వీసీలో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు శ్రీవత్స, అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ వాసుచంద్ర, బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి హరికృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు

వినతులు సత్వరమే పరిష్కరించాలి

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులు సత్వరమే పరిష్కరించాలని అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్ సెల్‌కు కలెక్టర్ హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈడీ ఎస్సీ కార్పొరేషన్ 31, జీడబ్ల్యూఎంసీ 12, తహసీల్దార్ కాజీపేట 09, తహసీల్దార్ ధర్మసాగర్ 05లతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 119 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వరంగల్‌లో..

వరంగల్: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వ అధికారులను వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ప్రజల నుంచి కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు శ్రీవత్సకోట, అశ్విని తానాజీ వాకడే ఫిర్యాదులు స్వీకరించి ఎండార్స్ చేసి సంబంధిత అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు 130 వచ్చాయని, వాటిలో ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలపై వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ సంపత్‌రావు, ఆర్డీఓ వాసు చంద్ర, జిల్లాలోని అధికారులు పాల్గొన్నారు.

నేడు నగరంలో స్పోర్ట్స్ ర్యాలీ

కాశిబుగ్గ: జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో మంగళవారం స్పోర్ట్స్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా క్రీడల అధికారి ఎస్.ఇందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈర్యాలీ ఉదయం 9.30 గంటలకు కాశిబుగ్గ జంక్షన్ నుంచి ప్రారంభమై ఓసిటీ స్టేడియం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. నగరంలోని విద్యార్థులు, యువత, ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

విద్యారంగ పటిష్టానికి ప్రభుత్వం కృషి



ఉపకరణాలు పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్

విద్యారణ్యపురి: విద్యా వ్యవస్థను పటిష్టపరచడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాల ఆవరణలో ఎంపిక చేసిన ప్రత్యేక అవసరాల పిల్లలకు (దివ్యాంగులు) ఉపకరణాలు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎండీ.అబ్దుల్‌హై, జిల్లా మొబిలైజింగ్ కోఆర్డినేటర్ రాధ, ఖాన్‌పూర్ అలీంకో కంపెనీకి సంబంధించిన వైద్యుడు అవినాష్‌సింగ్, ఎంజీఎం వైద్యులు తేజస్వి, మాలిక, డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

'మల్లికాంబ' భవన నిర్మాణానికి శంకుస్థాపన

హన్మకొండ అర్బన్: నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రం ఆవరణలో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భవనం కొంతమేర దెబ్బతినగా, కొత్త భవన నిర్మాణానికి చీఫ్ విప్ తన వంతు సాయంగా రూ.1,01,116లను నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు లలితాదేవి, ప్రొఫెసర్ పద్మ, బండా సందానందం, యాదగిరి, కోడం కల్యాణ్ పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి పెద్దపీట



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాలనీవాసులు

హసన్‌పర్తి: దళితుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి అన్నారు. 66వ డివిజన్ హసన్‌పర్తి అంబేద్కర్ నగర్‌కాలనీ అభివృద్ధికి రూ.20లక్షలు మంజూరు చేశారు. అలాగే, శ్మశాన వాటిలో హైమాస్ట్ లైట్లతో పాటు స్నానపు గదుల ఏర్పాటు, బాప్టిస్ట్ చర్చి వద్ద మరో హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

కార్యకర్తలను కాపాడుకుంటా..

హసన్‌పర్తి: పార్టీ కార్యకర్తలకు కాపాడుకుంటానని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 2వ డివిజన్ వంగపహాడ్‌లోని పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో సోమవారం చేశారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే రమేష్ ఆహ్వానించారు.

వరంగల్: గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఏనుమాముల గ్రామానికి చెందిన పలువురు నాయకులు బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేశారు.

ప్రజాస్వామ్య వాటా కోసం పోరాటం



లోగోను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ: ప్రపంచంలో ఏ దేశంలో లేనివిధంగా భారతదేశంలో కుల వివక్షతో బహుజన కులాలను అణిచి వేస్తున్నారని, ఈ అణచివేతకు వ్యతిరేకంగా బహుజనులు ప్రజాస్వామ్య వాటా కోసం పోరుబాట పట్టాలని తెలంగాణ బహుజన సమైఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చంటి ముదిరాజ్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని తెలంగాణ బహుజన సమైఖ్య రాష్ట్ర కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి తెలంగాణ బహుజన సమైఖ్య ప్రతినిధుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ బహుజన సమాఖ్య లోగోను ఆవిష్కరించారు. అనంతరం చంటి ముదిరాజు మాట్లాడుతూ మానవ జాతి పరిణామ క్రమంలో బలహీన జాతిని ఒక బలమైన జాతి అణిచివేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జై భీమ్ నాయకుడు తాళ్లపల్లి విజయ్, తెలంగాణ బహుజన సమైఖ్య రాష్ట్ర కన్వీనర్ స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొరం అభిలాష్, నాయకులు నమిండ్ల రాజు, నమిండ్ల హరీశ్, సంగాల నవీన్, మీసాల విజయ్, శనిగరపు అనిత, సంగాల కళాధర్, సంధ్య పాల్గొన్నారు.

నియామకం

శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అశోక్



కాజీపేట: శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ జిల్లా కాజీపేట మండల కేంద్రానికి అశోక్ మాచేను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ సాయిలు సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

ఉత్తమ జిల్లా గవర్నర్‌గా భూపతి శంకర్



హన్మకొండ: లయన్స్ క్లబ్ హనుమకొండ జిల్లా గవర్నర్, న్యాయవాది భూపతి శంకర్.. ఉత్తమ గవర్నర్‌గా అవార్డు అందుకున్నారు.

రెడ్డి కమిటీ జిల్లా సభ్యుడిగా టీఆర్‌కే రెడ్డి



హసన్‌పర్తి: రెడ్డి ఐక్య కార్యాచరణ కమిటీ హనుమకొండ జిల్లా సభ్యుడిగా భీమారానికి చెందిన తుమ్మ రామకృష్ణరెడ్డి నియమితులయ్యారు.

అమరుల స్ఫూర్తితో మరో పోరాటం



అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: విద్యుత్ పోరాట అమరుల స్ఫూర్తితో మరో పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బీ.చక్రపాణి పిలుపునిచ్చారు. విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సుందరయ్య భవన్‌లో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్ అధ్యక్షతన అమరుల చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఉప్పలయ్య, వీరన్న, సంపత్, కుమారస్వామి, భానునాయక్, లింగమూర్తి, రాజేందర్, గోపి పాల్గొన్నారు. అలాగే, హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు ఎల్లేశ్, లక్ష్మణ్, భిక్షపతి, రాజుగౌడ్, రవి, శంకర్‌నాయక్, దీన, మనోహర్ సదానందం పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్డును బాగు చేయాలి

కాజీపేట: ధ్వంసమై ప్రమాదాలకు నిలయంగా మారిన తారురోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయించాలని బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి మేకల శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులో ధ్వంసమైన తారురోడ్డును బీజేపీ కార్యకర్తలతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ అధికారుల పట్టింపులేనితనం వల్ల నెల రోజుల్లో 25కు పైగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నట్లు విమర్శించారు. రాత్రి వేళల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఎసీఎస్ సభ్యుడు కాయిత రాజ్‌కుమార్ యాదవ్, మూల కరుణాకర్ రెడ్డి, కంది నవీన్, మేకల కుమారస్వామి, జక్కుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

కొనసాగుతున్న శ్రావణమాస పూజలు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వర స్వామి



కాశిబుగ్గ: పెరుగుతో అభిషేకం చేస్తున్న భక్తులు

మడికొండ: శ్రావణమాసం సందర్భంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో చైర్మన్ దువ్వ నవీన్, కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు చింతకుంట్ల భూపాల్‌రెడ్డి, ఓర్సు రాజు, బుర్ర సంధ్యారాణి, పెద్ది ప్రభాకర్, కుమారస్వామి, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో..

కాశిబుగ్గ: శ్రావణమాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18 కిలోల పెరుగుతో కాశీ విశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి పూజలు నిర్వహించారు. వేముల నాగరాజు, పోశాలు, శ్రీను, రవీందర్, వెంకన్న, రోజా, రమాదేవి, అర్చకులు రజనీకుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నతంగా రాణించాలి



మాట్లాడుతున్న దామోదర్

హసన్‌పర్తి: విద్యార్థినులు లక్ష్యాన్ని ఎంచుకుని తదనుగుణంగా కృషి చేసినప్పుడే ఉన్నతంగా రాణిస్తారని సీడబ్ల్యూసీ (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ) సభ్యుడు కే.దామోదర్ అన్నారు. హసన్‌పర్తిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల డిగ్రీ గురుకుల కళాశాలలో 'సంస్కార వికాస శిక్షణ'పై సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యపై ఆసక్తిని పెంచుకుంటూ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మహనుభావుల స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ సంస్థ అధ్యక్షుడు దామెర నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థినులు అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ వింధ్యారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు శ్రీలత, గౌసియా, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతోనే స్వయం ఉపాధి

కాజీపేట అర్బన్: వృత్తి నైపుణ్యంలో మెళకువలను నేర్చుకుని మహిళలు స్వయం ఉపాధితో ముందుకు సాగాలని సంకల్పం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ సూచించారు. హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేటలో సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆవుల శ్రీనివాస్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. 45 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రైనర్లు చంద్రకళ, సునీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆవుల శ్రీనివాస్

సంక్షిప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ఖిలా వరంగల్: వరంగల్ 42వ డివిజన్ రంగశాయిపేట గడిమైసమ్మ సెంటర్ నుంచి కోమటివాడ గాంధీసెంటర్ వరకు కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ గుండు చందనతో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ రవికిరణ్, ఏఈ మొజామిల్, పూర్ణచందర్, కరుణాకర్, ముతినేని రామమూర్తి, చంద్రమౌళి, పాకాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మరణించిన ముచ్చర్లకు చెందిన బొక్క మల్లయ్య మృతదేహాన్ని బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం, అంత్యక్రియల నిమిత్తం రూ.3 వేలు అందజేశారు.

పరిశుభ్రతపై అవగాహన

హన్మకొండ చౌరస్తా: ఆదివారం ఉదయం పది గంటల పది నిమిషాల కార్యక్రమంపై హనుమకొండలోని 9వ డివిజన్‌లో కార్పొరేషన్ సిబ్బంది ఇంటింటికి కరపత్రాలు సోమవారం పంపిణీ చేసి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ చీకటి ప్రకాష్, మలేరియా సిబ్బంది అల్లి శ్రీనివాస్, సాంబయ్య, రాజ్‌కుమార్, సతీష్, రాజు, శ్రీనివాస్, ప్రదీప్ స్థానికులు పాల్గొన్నారు.

వంద ఫీట్ల రోడ్డుపై రాకపోకలు షురూ

హన్మకొండ: హనుమకొండ వంద అడుగుల రోడ్డుపై వాహనాల రాకపోకలను సోమవారం పునరుద్ధరించారు. హనుమకొండ కేయూసీ - కాజీపేట ఫాతిమానగర్ వంద అడుగుల రోడ్డు, అంబేడ్కర్ భవన్ 80 ఫీట్ల రోడ్డు అడుగుభాగంలో డక్ట్ అండ్ డ్రైన్ నిర్మాణంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రెండేళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో ఆర్టీసీ బస్సులు సహా ఇతర వాహనాలను గోపాల్‌పూర్, జవహర్‌నగర్ మీదుగా మళ్లించారు.

కేయూ కాంట్రాక్టు లెక్చరర్ల ధర్నా

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కేయూ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, జేఏసీ బాధ్యులు తూర్పాటి వెంకటేష్, డాక్టర్ మధుకర్ రావు, డాక్టర్ వీణ, సుధీర్, వాణిశ్రీ, యశస్విని, కిషన్, కిరణ్, సాయి, తరుణ్, శ్రీజ, స్వప్న, సాహితి, అర్చన, దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించేలా చొరవ చూపాలి

విద్యారణ్యపురి: గత జూన్ నుంచి ఇప్పటివరకు తమకు వేతనాలు చెల్లించడం లేదని హనుమకొండ ప్రభుత్వ విద్యాశిక్షణ సంస్థలో పనిచేస్తున్న 14మంది గెస్ట్ లెక్చరర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు చొరవ చూపి వేతనాలు చెల్లించేలా కృషి చేయాలని హనుమకొండ ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

దివ్యాంగులకు సదరం స్లాట్లు పెంచాలి

ఖిలా వరంగల్: దివ్యాంగుల కోసం సదరం సర్టిఫికెట్ల స్లాట్స్ బుకింగ్ కొన్ని నిమిషాల్లోనే ముగించడం వల్ల అనేక మంది దివ్యాంగుల నష్టపోతున్నారని, ఈక్రమంలో సదరం స్లాట్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.అజీమ్ కోరారు. ఈమేరకు గ్రీవెన్ సెల్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు బండి చక్రపాణి, అంబటి రాజేందర్, అబ్దుల్ షబ్బీర్, రాజు, వంశీ, దివ్యాంగులు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్య పోటీల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కాశిబుగ్గ: ఎస్‌సీఎస్ కళాక్షేత్రం వార్షికోత్సవం సందర్భంగా అక్టోబర్ 1, 2వ తేదీల్లో హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య పోటీలు, సాంప్రదాయ కూచిపూడి ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నృత్య గురువు కొంతం వెంకటేశ్వర్లు తెలిపారు. ఓసిటీ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు.

పశ్చిమ టికెట్‌కు ఇస్మాయిల్ దరఖాస్తు

హనుమకొండ: వరంగల్ పశ్చిమ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సీటు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వరంగల్ జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మెన్ యూనికాన్ కూలర్స్ అధినేత మహ్మద్ ఇస్మాయిల్ షంషీ తెలిపారు. హనుమకొండ సుబేదారి అలీపురాలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

దళిత జర్నలిస్టులను ఆదుకోవాలి

నయీంనగర్: ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న దళిత జర్నలిస్టులకు దళిత బంధు పథకం ద్వారా ఆర్థిక సాయం చేసి ప్రభుత్వం ఆదుకోవాలని దళిత జర్నలిస్టుల ఐక్య వేదిక కన్వీనర్ కంకణాల సంతోష్ విజ్ఞప్తి చేశారు. నామమాత్రపు లైన్ అకౌంట్ మీద ఆధారపడి కుటుంబ పోషణభారంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

నడకతో ఆరోగ్యం

హసన్‌పర్తి: ప్రతినిత్యం కొంతదూరం నడవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని హసన్‌పర్తి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి ఆరెల్లి వెంకటస్వామి తెలిపారు. హసన్‌పర్తి పెద్ద చెరువు వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా సోమవారం గడ్డి మందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు కట్టపై ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు.

వీహెచ్‌పీఎస్ ఆవిర్భావం

కాజీపేట అర్బన్: వీహెచ్‌పీఎస్ (వికలాంగుల హక్కుల పోరాట సమితి) 16వ ఆవిర్భావ వేడుకలను హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేట చౌరస్తాలో మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు సూరన్న, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూడపాక శ్రీనివాస్, బొట్ల సురేష్, మంద చిన్న, సుకుమార్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

కాజీపేట: కాజీపేట డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురికి రెండు రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ విద్యాసాగర్ రావు తీర్పునిచ్చారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ సుజాత కథనం ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 28మందిని కోర్టులో హాజరుపర్చారు. బొద్దు రాజు, సామల రాములు, సింధె భీమ్‌లకు రెండు రోజుల జైలు, 25 మందికి రూ.62,900 జరిమానా విధించినట్లు సీఐ వివరించారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

హసన్‌పర్తి: కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ వర్ధన్నపేట నాయకుడు చుంచు రవీందర్ అన్నారు. హసన్‌పర్తి మండలంలోని పెంబర్తి, సీతంపేట, గంటూరుపల్లి గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ప్రచారం చేశారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

రామన్నపేట: గతనెల 16వ తేదీన వరంగల్ రైల్వేస్టేషన్ స్కూటర్ స్టాండ్ వద్ద అపస్మారక స్థితిలో పడిపోయిన గుర్తు తెలియని మహిళను ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈక్రమంలో పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందినట్లు ఇంతెజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ముషికే శ్రీనివాస్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మామునూరు: సైబర్ నేరాలు, సాంఘిక దురాచారాలు, ట్రాఫిక్ నియమాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ సూచించారు. ఈమేరకు బొల్లికుంట, నక్కలపెల్లి గ్రామాల్లో వరంగల్ జాగృతి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో చట్టాలపై సోమవారం రాత్రి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రమోద్‌కుమార్, ఏఎస్సై నాగమణి, హెడ్ కానిస్టేబుళ్లు విలియం, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, విక్రంరాజు, నారాయణ, చిరంజీవి పాల్గొన్నారు.

అనుమతిలేని ప్రహరీ కూల్చివేత



ప్రహరీని కూల్చివేస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

వరంగల్ అర్బన్: హంటర్‌రోడ్డు శాయంపేట 30వ డివిజన్‌లో జూపార్కు ఎదురుగా గుట్టను ఆనుకొని అనుమతి లేకుండా నిర్మిస్తున్న ప్రహరీని గ్రేటర్ వరంగల్ సిబ్బంది సోమవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా కాజీపేట్ సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ అక్రమంగా నిర్మాణాలు చేపడితే ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే కూల్చివేతలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.